PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 315 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 08 నవంబర్ 2026

తుపాను బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి



సాంస్కృతిక సారథి కళాకారులకు ఉద్యోగుల ఐక్యవేదికలో సముచిత స్థానం





పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయం సెలవు కావున సోమవారం పత్రిక వెలబడదు. తిరిగి పునర్ దర్శనం మంగళవారం

పాలమూరు అభివృద్ధికి అడ్డుపడింది
కేసీఆర్ పాలనే!



- జైలు భయంతోనే కాళేశ్వరంపై సీబీఐ విచారణలో జాప్యం
- అందుకే మోడీ ముందు కేసీఆర్ మోకరిల్లారు
- హైదరాబాద్ నుంచి లగచర్లకు బారులు తీరేలా తీర్చిదిద్దుతా
- విద్య, వైద్యం, ఉపాధి కోసం కొడంగల్ బాట పట్టాలి: కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- హకీంపేటలో మంత్రులతో కలిసి రైతు మేళా ప్రారంభం

రంగారెడ్డి,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ప్రాణహితచేవెళ్ల సాగునీటి ప్రాజెక్టుకు నాటి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పిస్తామని చెప్పినా, కేసీఆర్ తన నియంతృత్వ ధోరణితో ప్రాజెక్టు పేరు, ఊరు మార్చి కాళేశ్వరం నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు కూడా అందించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగకుండా కేసీఆర్ ఢిల్లీలో ప్రధాని మోడీ ముందు మోకరిల్లి జాప్యం చేయిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ పేరెత్తితే మామ, అల్లుడికి వణుకు పుడుతోందని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

కొడంగల్ ఎత్తిపోతల టెండర్లలో
భారీ దోపిడీ!

- మంత్రి పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియ
- రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్కనీరు అందకముందే ఐదు రెట్లు పెరిగిన అంచనా వ్యయం: కేటీఆర్



హైదరాబాద్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): కొడంగల్‌నారాయణపేటమక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన శనివారం సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. కొడంగల్‌నారాయణపేటమక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలవగా, మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా వాటిలో పాల్గొన్నదని ఆరోపించారు. నామమాత్రపు కంపెనీలతో టెండర్ల ప్రక్రియటెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలుగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం మిగతా2లో...

బీజేపీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టం

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలు బలహీనపడ్డాయి

'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంపై సోనియాగాంధీ ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలన వల్ల దేశ సామాజిక స్వరూపం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలకు తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అన్నారు. తన జీవిత కథ ఆధారంగా రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం సందర్భంగా 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలను వెల్లడించారు. గత 12 ఏళ్లలో మిగతా2లో...

నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమలో
మోస్తరు వర్షాలు

పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన



రష్యాతో ట్రంప్ రహస్య చర్చలు

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా ప్రయత్నాలు



వాషింగ్టన్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రేవ్‌తో రహస్యంగా సమావేశమయ్యారు. రష్యాఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశం మిగతా2లో...

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత
పింఛన్లు

నేడు కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం



హైదరాబాద్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి ఆదివారం కొడంగల్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు సీఎం స్వయంగా మిగతా2లో...

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

సైనికులతో కలిసి పండుగ జరుపుకుంటా...



తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

- ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు, రేవంత్‌రెడ్డి



దీపావళి పండుగపై
ధరల భారం!

నెయ్యి, వెన్న నుంచి డ్రైఫ్రూట్స్ వరకు భారీగా పెరిగిన ధరలు

70 శాతం వరకు పెరిగిన పిస్తా ధరలు.. 15 శాతం పెరిగిన మిఠాయిల తయారీ వ్యయం



సిద్దిపేట అభివృద్ధి పనులపై
హరీశ్‌రావు నిలదీత

- వెటర్నరీ కళాశాల తరలింపుపై ఆగ్రహం.. నిలిచిపోయిన ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ప్రశ్నలు



సిద్దిపేట,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): సిద్దిపేట జిల్లాలో గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. శేఖర్‌రావుపేటలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు సంధించారు. కొడంగల్‌లో అభివృద్ధి పనులపై ప్రస్తావనగత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొడంగల్‌లో రెండు 50 పడకల ఆస్పత్రులు, ఫైర్‌స్టేషన్, తండాలకు మిగతా2లో...

పాలమూరు అభివృద్ధికి అడ్డుపడింది కేసీఆర్ పాలనే!

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మేళాలో సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, శ్రీహరితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే పాలమూరు అభివృద్ధి చెందుతుందని ఆశించి 2009లో కేసీఆర్‌ను ఈ ప్రాంతం నుంచి పార్లమెంట్‌కు పంపించారని గుర్తుచేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, మక్తల్‌కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారని తెలిపారు. కానీ కేసీఆర్ పదేండ్ల పాలనలో పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ ప్రాంతానికి రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీలు, సాగు, తాగునీటి సౌకర్యాలను కూడా కల్పించలేదన్నారు. తమ ప్రభుత్వంలో మక్తల్‌నారాయణపేట ఎత్తిపోతల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.గతంలో రైతులకు ఎకరానికి రూ.2 లక్షల పరిహారం కూడా ఇవ్వలేదని, మంత్రి శ్రీహరి రైతులకు ఎకరానికి రూ.20 లక్షల పరిహారం ఇప్పించారని పేర్కొన్నారు. కొడంగల్‌ను విద్య, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్ విమానాశ్రయం నుంచి లగచర్ల ఇండస్ట్రియల్ పార్క్ వరకు అభివృద్ధి విస్తరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాండూరు కంది పప్పును ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేసి స్థానిక రైతుల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రస్తుతం కరువు పరిస్థితుల్లో రైతులకు సాగునీరు అందించలేకపోతున్నామని సీఎం అన్నారు. మేడిగడ్డ కూలిపోవడానికి గత ప్రభుత్వ పెద్దల కమీషన్ల కక్కుర్తే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం లక్షలాది ఎకరాలకు నీరందుతోందని తెలిపారు. ఎల్‌నినో, గోదావరి, కాళేశ్వరం జలాలపై చర్చించేందుకు రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్లు చెప్పారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల వ్యవహారాలపై వాస్తవాలు వెల్లడిస్తామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినో కరువును అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి వచ్చి ప్రజలను కలుస్తానని సీఎం తెలిపారు.

కొడంగల్ ఎత్తిపోతల టెండర్లలో భారీ దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)

సాధించేలా ఈ వ్యవహారం సాగిందని విమర్శించారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు తావులేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.**ఐదేళ్లలో కాదు.. ఐదు రెట్లు పెరిగిన అంచనా వ్యయం** ఈ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం భారీగా పెరగడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని తెలిపారు. అంటే దాదాపు ఐదు రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. ఇంత భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. **తాగునీటి కోసం ప్రజల అవస్థలు** తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. ఒకవైపు ప్రజలు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి, కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. **రాహుల్‌గాంధీ స్పందించాలి** కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్ల వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న ఈ వ్యవహారాన్ని వివరిం చేందుకు క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇలాంటి దోపిడీకి సరిపో యే కొత్త పదాన్ని రాహుల్ గాంధీ సూచించాలని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్లలోనూ అనుకూలమైన సంస్థలకే లబ్ధి చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

అమరావతి, హైదరాబాద్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. **ప్రతి దీపం సమాజానికీ వెలుగునివ్వాలి: చంద్రబాబు** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని చంద్రబాబు పేర్కొ న్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరి యాలని, ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు. మనం వెలిగించే ప్రతి దీపం ఇంటికే కాకుండా సమాజానికీ వెలుగునివ్వాలని, ఇతరుల జీవితాల్లో సంతోషం నింపడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐకమత్యం, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు.**ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు: రేవంత్‌రెడ్డి** దీపావళి వెలుగులు ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.**పవన్ కల్యాణ్, కేసీఆర్ శుభాకాంక్షలు** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

దీపావళి పండుగపై ధరల భారం!

న్యూఢిల్లీ,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ఈ ఏడాది దీపావళి పండుగ సంబరాలు సామాన్యుల జేబులకు చిల్లులు పెట్టనున్నాయి. పండుగ మిఠాయిల తయారీకి అవసరమైన నెయ్యి, వెన్న, పాల ఉత్పత్తులతో పాటు డ్రైఫ్రూట్స్ ధరలు భారీగా పెరిగాయి. గత దీపావళితో పోలిస్తే కొన్ని రకాల పిస్తా ధరలు ఏకంగా 70 శాతం వరకు పెరిగాయి. మిఠాయిలు, బహుమతి ప్యాకెట్ల తయారీ వ్యయాలు కనీసం 15 శాతం పెరగడంతో పండుగ ఖర్చులు మరింత భారంగా మారాయి.**పాల ఉత్పత్తుల ధరల పెంపు** పండుగ సమయంలో డిమాండ్ పెరగడం, సరఫరా పరిమితుల కారణంగా అమూల్, నందిని, ఆవిన్ వంటి డెయిరీ సంస్థలు పలు ఉత్పత్తుల ధరలను పెంచాయి. అమూల్ కిలో నెయ్యి ధర రూ.630 నుంచి రూ.680కి చేరింది. 500 గ్రాముల నెయ్యి ప్యాక్ ధర రూ.325 నుంచి రూ.345కి పెరిగింది. 100 గ్రాముల వెన్న ప్యాక్ రూ.63 నుంచి రూ.66కు, 500 గ్రాముల ప్యాక్ రూ.310 నుంచి రూ.325కు చేరింది. ఆన్‌లైన్ మార్కెట్‌లో లీటరు నెయ్యి ధర రూ.700 నుంచి రూ.740 వరకు పలుకుతోంది.**ఆకాశాన్నంటుతున్న డ్రైఫ్రూట్స్ ధరలు** డ్రైఫ్రూట్స్ ధరలు కూడా సామాన్యులకు భారంగా మారాయి. గత దీపావళితో పోలిస్తే పిస్తా ధరలు 60 నుంచి 70 శాతం, బాదం ధరలు 20 నుంచి 40 శాతం పెరిగాయి. మిఠాయిల తయారీలో ఉపయోగించే పెషావరి పిస్తా కిలో ధర రూ.4,000కు చేరింది. పొట్టు తీయని పిస్తా హోల్‌సేల్ ధర ఏడాదిలో 74 శాతం పెరిగి కిలో రూ.1,650కు చేరింది. జీడిపప్పు ధరలు 5 నుంచి 8 శాతం, కిస్‌మిస్ 2 నుంచి 5 శాతం, ఖర్జూరం 5 నుంచి 10 శాతం, అంజీర్ 5 నుంచి 15 శాతం పెరిగాయి. అమెరికాఇరాన్ ఘర్షణల కారణంగా ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి దిగుమతులకు ఎదురవుతున్న సరఫరా సమస్యలు ధరల పెరుగుదలకు కారణమని దిగుమతిదారులు చెబుతున్నారు. **కార్పొరేట్ బహుమతుల బడ్జెట్‌కు కోత** ముడిసరుకులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో మిఠాయిలు, ప్రీమియం గిఫ్ట్ హ్యాంపర్ల ధరలు కనీసం 15 శాతం పెరిగాయి. దీంతో పలు కంపెనీలు ఉద్యోగులు, ఖాతాదారులు, వ్యాపార భాగస్వాములకు ఇచ్చే దీపావళి కానుకల జాబితాను తగ్గిస్తున్నాయి. పెద్ద బహుమతి ప్యాకెట్లకు బదులుగా చిన్న ప్యాకెట్లను ఎంపిక చేసుకుంటున్నాయి.**పెరుగుతున్న ద్రవ్యోల్బణం** సెప్టెంబర్‌లో ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరగా, మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి పెరిగింది. చక్కెర, మిఠాయిల ధరల ద్రవ్యోల్బణం ఆగస్టులో 10.9 శాతం ఉండగా, సెప్టెంబర్‌లో 13.8 శాతానికి చేరింది. చక్కెర ధరల పెరుగుదల కూడా 24.3 శాతం నుంచి 29.8 శాతానికి ఎగబాకింది. ఈ పరిణామాలతో పండుగ కొనుగోళ్లు సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై మరింత భారంగా మారనున్నాయి.

నదుల అనుసంధానంతోనే నల్లగొండ నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం!

గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానించాలి

డిండి ప్రాజెక్టుపై ప్రభుత్వ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదు: కల్వకుంట్ల కవిత

నల్లగొండ,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సాగునీటి, తాగునీటి సమస్యలతో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే గోదావరి, కృష్ణా నదుల అనుసంధానమే మార్గమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం



డిండి రిజర్వాయర్ వద్ద నిర్వహించిన ప్రజెంటేషన్‌లో ఆమె మాట్లాడారు. ఏదుల నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలిస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని కవిత విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఉన్న పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకే అవసరమైన నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. గోదావరి జలాలను వినియో గించుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న బస్వాపూర్ రిజర్వాయర్, అనుబంధ పనులను పూర్తి చేయాలని ఆమె సూచించారు. గత ప్రభుత్వ హయా ంలో సాగునీటి రంగంలో జరిగిన తప్పులకు తాను కూడా బాధ్యత వహిస్తానని అంగీకరించిన కవిత, ప్రస్తుత ప్రభుత్వం కూడా కీలక ప్రాజెక్టులను ముం దుకు తీసుకెళ్లడంలో విఫలమైందని విమర్శించా రు. కరువు పరిస్థితులతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీజేపీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం మారిన తర్వాత కూడా వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు చాలా సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లభించడం లేదని, ఎన్నికల సంఘం, ప్రధాన మీడియాపై అధికార పార్టీ ప్రభావం ఉందని విమర్శించారు.తన రాజకీయ ప్రయాణం, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీల నుంచి నేర్చుకున్న విలువలు, 1975-77 అత్యవసర పరిస్థితి, 2004లో ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వంటి అంశాలను ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. ప్రజల్లో అసహనం పెరుగుతోందని, ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణపై తాను ఆశాభావంతో ఉన్నానని సోనియాగాంధీ పేర్కొన్నారు.

నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు

కోస్తాంధ్ర, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్):
రాయలసీమ ప్రాంతాల్లో నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్ష సూచన ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రష్యాతో ట్రంప్ రహస్య చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ట్రంప్ వెల్లడించారు. అయితే చర్చల వివరాలను మాత్రం బయటపెట్టలేదు.రష్యాతో సంబంధాలను మెరుగుపరుచుకోవడం ద్వారా చైనారష్యా బంధాన్ని బలహీనపరచడంతో పాటు ఇంధన రంగంలో ఆర్థిక ప్రయోజనాలు పొందాలని అమెరికా భావిస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా నుంచి డీజిల్ దిగుమతులపై కూడా చర్చలు జరిగినట్లు కథనం పేర్కొంది.మరోవైపు, ఈ ఒప్పందం ఉక్రెయిన్ భద్రత, ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రంప్‌పుతిన్ ప్రతినిధుల చర్చలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు.**మూడు వర్గాలకు పింఛన్లు** కొత్తగా మంజూరు చేసిన పింఛన్లలో వితంతువులు, ఒంటరి మహిళలకు 3 లక్షలు, దివ్యాంగులకు లక్ష, కల్లుగీత, చేనేత కార్మికులకు 50 వేల పింఛన్లు కేటాయించారు. మొత్తం 4.50 లక్షల మంది అర్హులకు లబ్ధి చేకూరనుంది. **అన్ని జిల్లాల్లో పంపిణీ** కొడంగల్‌లో కార్యక్రమం ప్రారంభమైన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన వారందరికీ నవంబర్ నెల నుంచే పింఛను మొత్తాన్ని అందించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్):
దీపావళి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాలు సుఖసంతోషాలు, ప్రశాంతత, విజయాలతో వెలిగిపోవాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో వీడియోను విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా సైనికులతో కలిసి దీపావళి జరుపుకుంటున్న మోదీ.. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని వెల్లడించారు.

సిద్దిపేట అభివృద్ధి పనులపై హరీశ్‌రావు నిలదీత

(మొదటి పేజీ తరువాయి)

రహదారులు, 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించామని హరీశ్‌రావు తెలిపారు. చెరువుల అభివృద్ధితో పాటు ప్రతి మండలంలో గోదాములు నిర్మించామని పేర్కొన్నారు. అలాంటప్పుడు సిద్దిపేటలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు.**నిలిచిపోయిన ప్రాజెక్టులపై ప్రశ్నలు** రంగనాయకసాగర్ కాలువల పనులు గతంలోనే 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మూడేళ్లయినా పూర్తి చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. వెయ్యి పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయని విమర్శించారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడం వెనుక కారణమేంటని ప్రభుత్వాన్ని నిలదీశారు.**రైతులకు ఇచ్చిన హామీలేవీ?** మూడు పంటలకు రైతుబంధు ఇవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో వ్యవసాయ బావుల వద్ద 24 గంటల విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం 7 నుంచి 8 గంటలకే ఎందుకు పరిమితమవుతోందని ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాలతో రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు.మూడేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని ముఖ్యమంత్రి చెబుతున్నారని, ఆ కష్టం ప్రజల కోసమా? కమీషన్ల కోసమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేటలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం!

ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి

ప్రతి భూమికి పట్టాతో పాటు మ్యాప్.. ప్రత్యేక భూధార్ నంబర్: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో భూ దోపిడీ జరిగిందని ఆరోపించారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రతి భూమికి పట్టాతోపాటు మ్యాప్ అందజేస్తామని, ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని తెలిపారు.దీంతో భూముల వివరాల్లో పారదర్శకత పెరిగి, భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడటంతో పాటు రాష్ట్రంపై రూ.8.25 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని విమర్శించారు. గత ప్రభుత్వ అప్పులకు ప్రతినెలా రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు.

సాంస్కృతిక సారథి కళాకారులకు ఉద్యోగుల ఐక్యవేదికలో సముచిత స్థానం

- సానుకూలంగా స్పందించిన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచిన సాంస్కృతిక సారథి కళాకారులకు ఉద్యోగుల ఐక్యవేదికలో సముచిత స్థానం కల్పించేందుకు సానుకూల స్పందన లభించింది. ఈ మేరకు సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘాన్ని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితిలో చేర్చాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు పాగి వెంకన్న ప్రధాన కార్యదర్శి బొమ్మెర ముత్యం ఆధ్వర్యంలో నాయకులు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిదని, ఆటపాటలతో గ్రామగ్రామాన ఉద్యమ చైతన్యం కల్పించారని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్న కళాకారులకు ఉద్యోగుల ఐక్యవేదికలో భాగస్వామ్యం కల్పించేందుకు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సానుకూలంగా ఉన్నామని తెలిపారు. దీంతో కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ టీఎన్జీవోస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరు సంఘాల నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): తుపాను కారణంగా పంటలు నష్టపోయిన ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, బీమాతో సంబంధం లేకుండా ప్రతి బాధిత రైతుకు పరిహారం అందించాలని కోరారు. శనివారం ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఇతర నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ముగ్గురు మంత్రులు కేటాయించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మురసు తుపాను ప్రభావంతో వరి, మిర్చి, పత్తి, ఉద్యానవన పంటలు దెబ్బతిని సుమారు 50 వేల ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని, దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులను వెంటనే బాగుచేయాలని కోరారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బేతు పల్లి చెరువు వద్ద వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన జాతీయ విపత్తు స్పందన దళం సిబ్బందిని అభినందించారు.

డంపింగ్ యార్డు ఎత్తివేతకు నవంబర్ 15 నుంచి నిరసన దీక్షలు

మచ్చ బొల్లారం చెత్తను జవహర్ నగర్‌కు తరలిస్తే ప్రజాగ్రహం తప్పదు

గడువుతో కూడిన తరలింపు ప్రణాళిక ప్రకటించాలి: జేపీసీ చైర్మన్ షేక్ షావలి



జవహర్ నగర్, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): జవహర్ నగర్ డంపింగ్ యార్డును పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 15 నుంచి వరుస నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట సమితి (జేఏసీ) చైర్మన్ షేక్ షావలి ప్రకటించారు. మచ్చ బొల్లారం ప్రాంతానికి చెందిన చెత్తను జవహర్ నగర్‌కు తరలించే ప్రయత్నాలు చేస్తే ప్రజాగ్రహం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు సమస్యతో పరిసర ప్రాంతాల్లోని 30 గ్రామాల ప్రజలు తీవ్ర ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు 40 లక్షల మంది ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యార్డును శాశ్వతంగా తరలించాలని కోరారు. తరలింపునకు అవసరమైన నిధులు, పర్యావరణ అనుమతులు, నిర్దిష్ట గడువుతో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టుకుంటూ సమస్యను సాగదీయడం సరికాదన్నారు. నవంబర్ 3న జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రకటించిన కార్యాచరణపై స్పష్టత లేదని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు తరలింపుపై 15 రోజుల్లో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని కోరినట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి శాంతియుతంగా నిరసన దీక్షలు ప్రారంభిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడి, ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్రలు చేపడతామని హెచ్చరించారు. మచ్చ బొల్లారం చెత్త తరలింపు ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య రాజకీయాల నిర్మాణానికి

వామపక్ష శక్తులు ఏకం కావాలి

- నవంబర్ 28న ఢిల్లీలో జరిగే సదస్సును విజయవంతం చేయండి: వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక పిలుపు



న్యూఢిల్లీ, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల సాధన కోసం వామపక్ష, విప్లవ, ప్రజాస్వామ్య శక్తులు, పూలేఅంబేడ్కర్ భావజాల సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (యూఎల్‌డీఎఫ్) కో-కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట దాసు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీల పాలనకు భిన్నంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యంతో నవంబర్ 28న న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. వామపక్ష ఉద్యమాలు వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, పూలేఅంబేడ్కర్ ఉద్యమాలు కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ రెండు శక్తులు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులు, పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, సామాజిక న్యాయం పరిరక్షణకు విస్తృత ఉద్యమాలు అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల పొత్తులకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై స్వతంత్రంగా పోరాడాలని అన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలను ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 28న జరిగే సదస్సులో ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక న్యాయ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని ప్రొఫెసర్ వెంకట దాసు కోరారు.

తొర్రూరు పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తా...

- **80 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు ,డ్రైనేజీల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరిగినా అనంతరం గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండల కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోఅభివృద్ధికి మరో ముందడుగు వేసి రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..తొర్రూరు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని అన్ని వార్డుల్లో రూ.80 లక్షల సాధారణ (ఎంజీ ఎఫ్) నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.తొర్రూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పిస్తానని అన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు






కల్లూరు, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :తెలంగాణ గ్రామర్ స్కూల్ నందు దీపావళి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని బాణాసంచా కాల్చుతూ, దీపావళి శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ దీపావళి పండుగ విశిష్టతను, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని వివరించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో దీపావళి వెలుగులు, సంతోషాలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆనందోత్సాహాలు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకలు అందరిలో ఆనందాన్ని, ఐక్యతా భావాన్ని నింపాయి.

గుండెపోటుతో వ్యక్తి మృతి

- నివాళులర్పించిన తిరువూరు మున్సిపల్ చైర్మన్ పసుపులేటి మాధవి పండు



కల్లూరు, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): మండల పరిధిలో పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన పెద్దబోయన వీరబాబు గుండెపోటు తో శుక్రవారం మృతి చెందారు. ఇటీవల కాలంలో నెల రోజుల క్రితం హైదరాబాద్ ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు గుండె శాస్త్ర చికిత్స జరిగింది. ఈ మధ్యకాలంలో కొంత అనారోగ్యం ఉండటంతో వైద్యం కోసం హాస్పిటల్ కి వెళుతుండగా మార్గమధ్యంలోనే చనిపోయారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ చైర్మన్ పసుపులేటి మాధవి పండు ఆయన భౌతికాయమును సందర్శించి నివాళులర్పించినారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. విషయం తెలుసుకున్న ప్రముఖ జాబిశెట్టి హాస్పిటల్ అధినేత ప్రముఖ నాయకులు జాబిశెట్టి శ్రీనివాసరావు చర్వాణి ద్వారా వారి కుటుంబాన్ని పమర్శించారు. ప్రముఖులు కల్లూరు మాజీ సొసైటీ చైర్మన్ పెద్దబోయన మల్లేశ్వరరావు, సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, కౌన్సిలర్ కిష్టంచెట్టి లక్ష్మి భౌతికాయమును సందర్శించి నివాళులర్పించారు.

12న నియోజకవర్గ స్థాయి పోటీలు

- జేవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహణ.. ఎంపికైన విద్యార్థులు హాజరుకావాలి



సత్తుపల్లి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సత్తుపల్లి శాసనసభ నియోజకవర్గ స్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పోటీలను ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల నమోదు అధికారి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 6వ తేదీన నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు నవంబర్ 12వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో జరగనున్నాయి.పాఠశాల, కళాశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులందరూ నిర్ణీత సమయానికి పోటీలు నిర్వహించే కేంద్రానికి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సంబంధిత మండల విద్యాశాఖాధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందించి, వారు పోటీల్లో పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియలు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై తమ అవగాహన, ప్రతిభను ప్రదర్శించాలని కోరారు.

ఖేలో ఇండియా అస్మిత రగ్బీలో ఖమ్మం జయకేతనం

● తెలంగాణ రగ్బీ ఛాంపియన్లుగా ఖమ్మం బాలికలు ● చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు గర్వకారణం ● జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్ కుమార్ రెడ్డి









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకులు కావని, పట్టుదల, కఠోర శ్రమ, సరైన ప్రోత్సాహం ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినులు సైతం రాష్ట్రస్థాయిలో ఛాంపియన్లుగా విజయాలు సాధించగలరని ఖమ్మం జిల్లా బాలికలు నిరూపించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే అవకాశం లేకపోయినా, ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యనభ్యసిస్తూ చదువుతో పాటు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఖేలో ఇండియా అస్మిత రాష్ట్రస్థాయి అండర్15 రగ్బీ ఛాంపియన్లుగా నిలిచి ఖమ్మం జిల్లా కీర్తిపతాకాన్ని రాష్ట్రస్థాయిలో రెపరెపలాడించారని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్ కుమార్ రెడ్డి అన్నారు.ఖేలో ఇండియా అస్మిత రగ్బీలో తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్స్ గా గెలిచి ఆ ట్రోఫితో శుక్రవారం ఖమ్మం చేరుకున్న బాలికలు సర్దార్ పటేల్ స్టేడియంలోని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ రఘు ఆధ్వర్యంలో నవంబర్ 1, 2 తేదీలలో క్రీడాకారులకు కఠోర శిక్షణను ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపారన్నారు. నవంబర్ 3, 4, 5 తేదీల్లో సంగారెడ్డి జిల్లాలోని వాక్సెన్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో అండర్15, అండర్18 బాలికలకు అస్మిత రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నమెంట్ నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా అండర్15 బాలికల జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ప్రత్యర్థి జట్టుకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారన్నారు. ఆరు జిల్లాల జట్లను వరుసగా ఓడించి అజేయంగా నిలిచి తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ ట్రోఫిని కైవసం చేసుకోవడం గర్వ కారణమన్నారు. అదేవిధంగా అండర్18 విభాగంలోనూ ఖమ్మం బాలికలు తృతీయ స్థానాన్ని సాధించి తమ సత్తా చాటారన్నారు.అండర్15 విభాగంలో ఖమ్మం బాలికల విజయ పరంపర అసాధారణంగా సాగింది. ఖమ్మం జట్టు నిజామాబాద్‌పై 300, యాదాద్రి భువనగిరిపై 150, జగిత్యాలపై 350, మేడ్చల్‌పై 200, మెదక్‌పై 200 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. ఇక ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో కూడా నల్గొండ జట్టును సైతం 150తో ఓడించి రాష్ట్ర ఛాంపియన్లుగా అవతరించారన్నారు. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా మొత్తం 135 పాయింట్లు సాధించడం వారి అసాధారణ ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఖమ్మం బాలికలు రగ్బీ క్రీడలో తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్లుగా చరిత్ర సృష్టించడం జిల్లా మొత్తానికి గర్వకారణమన్నారు. మొదటి మ్యాచ్ నుంచి ఫైనల్ వరకు ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజయాలు సాధించడం సాధారణ విషయం కాదని, వారి క్రమశిక్షణ, సాధన, జట్టు సమన్వయం, ఆత్మవిశ్వాసానికి ఇది నిదర్శనమని కొనియాడారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన బాలికలు రాష్ట్రస్థాయి వేదికపై ఛాంపియన్లుగా నిలవడం వారి తల్లిదండ్రుల కష్టానికి దక్కిన గౌరవమని అన్నారు. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న విద్యార్థినులను అభినందించారు. ఈ విజయంతో వారి పాఠశాలలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు. బాలికల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఖమ్మం కీర్తిని చాటగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ విజయాల వెనుక ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ బి. రఘు కృషి ఎంతో ఉందని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన బాలికల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి, వారికి సొంత ఖర్చులతో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటున్నారు. శిక్షణతో పాటు భోజనం, వసతి, క్రీడా దుస్తులు సమకూర్చి విద్యార్థినులకు అండగా నిలుస్తూ వారిని రాష్ట్రస్థాయి క్రీడాకారిణులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు.ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రైవేట్ శిక్షణ పొందలేని ఎంతోమంది బాలికలకు రఘు అందిస్తున్న ఈ సహకారం కొత్త ఆశలను కల్పిస్తోంది. ఒకవైపు విద్యాభ్యాసం కొనసాగిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణించేలా రఘు చేస్తున్న కృషి మరింత మందికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి సేవాభావంతో కూడిన శిక్షణ, జిల్లా క్రీడా శాఖ ప్రోత్సాహం, పాఠశాలల సహకారం కలిసివస్తే మరెన్నో విజయాలు సాధించవచ్చని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఖమ్మం బాలికల ప్రతిభ ఈ ఒక్క విజయానికే పరిమితం కాలేదు. గత సంవత్సరం 2025లోనూ అస్మిత పోటీల్లో ఖమ్మం జిల్లాకు చెందిన అండర్15, అండర్18 విభాగాల 12 మంది బాలికలు సౌత్‌జోన్ స్థాయిలో ఐదు రాష్ట్రాల జట్లతో పోటీపడి ద్వితీయ స్థానం సాధించారు. గత ఏడాది సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ ఏడాది మరింత పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర ఛాంపియన్లుగా నిలవడం వారి నిరంతర కృషికి నిదర్శనం.ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చదివే బాలికల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని ఖమ్మం క్రీడాకారిణులు మరోసారి చాటిచెప్పారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు, శిక్షణ సదుపాయాల కొరత కారణంగా ఎంతోమంది విద్యార్థినులు తమ లక్ష్యాలకు దూరమవుతున్నారన్నారు. అలాంటి బాలికలకు జిల్లా యువజన, క్రీడల శాఖతో పాటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ, క్రీడా సంఘాలు, దాతలు మరింత అండగా నిలవాల్సిన అవసరం ఉంది.వారికి మెరుగైన క్రీడా పరికరాలు, నాణ్యమైన శిక్షణ, పోషకాహారం, ప్రయాణ ఖర్చులు, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు ఉన్నతస్థాయి శిక్షణ శిబిరాలకు అవకాశం కల్పించాలి. రాష్ట్రస్థాయి విజయంతో ఆగిపోకుండా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. పేదింటి ఆడబిడ్డల ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే వారు దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురాగలరనే విషయాన్ని ఈ బాలికల విజయం స్పష్టం చేస్తోందన్నారు.కప్ మాది.. గోల్డ్ మాది.. ఖమ్మం పేరు మాది! అన్న విజయోత్సాహంతో ముందుకు సాగుతున్న ఈ బాలికలకు మరిన్ని అవకాశాలు, మరింత ప్రోత్సాహం లభించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. వారి విజయ ప్రయాణం మరెంతోమంది పేద విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ బి. రఘు ను పిఈటి లు ప్రేమరాణి, సునీత, రాణి, వెంకటలక్ష్మి లు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.


కాలుష్యరహిత దీపావళిని జరుపుకోవాలి


- తెలుగు ప్రజలకు ఈపిడిసి అధ్యక్షుడు రంగయ్య విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): దీపావళి పండుగను పర్యావరణహితంగా, శబ్ద, వాయు కాలుష్యాలకు దూరంగా జరుపుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న కాలుష్యంతో వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని, ఎల్లనినో వంటి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ దీపకాంతులతో పండుగ జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ జీవన విధానంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ: బాధితుడికి ఎల్ఓసి అందజేత


APPLICATION FORM
FOR SEEKING FINANCIAL ASSISTANCE / EXGRATIA UNDER "CHIEF MINISTER'S RELIEF FUND"
Government of Telangana


బండి సంజయ కుమార్
BANDI SANJAY KUMAR
MINISTER OF STATE FOR HOME AFFAIRS
GOVERNMENT OF INDIA
MoS/(Home)(BS)/4574287/16/2026
04 NOV 2026
Dear Shri Anumula Revanth Reddy Garu
Sub: CM Relief Fund (LOC) – Requesting for sanction of LOC under Chief Minister's Relief Fund in favor of Shri. Thallapalli Kumar S/o. Chandraiah for General Medicine Dept. Patient has been Diagnosed Paraquat poisoning day 13 with aki s/p 3 sessions HD, and advised to undergo Medical management – Reg.
(Bandi Sanjay Kumar)
Shri. Anumula Revanth Reddy Garu,
Hon'ble Chief Minister,
Government of Telangana,
Dr. B.R. Ambedkar Telangana State Secretariat,
Hyderabad.
Office : Room No. 35044, Kartavya Bhawan-3, Janpath, New Delhi-110 001 Tel. : 24010331, 24010332

కరీంనగర్, నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి కుమార్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరగా, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలువేలి సమ్మిరెడ్డి విషయాన్ని కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆ కుటుంబానికి అండగా నిలిచారు. వెంటనే వారిని నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి, వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి ని మంజూరు చేయించారు.ఈ ఎల్ఓసి మంజూరు ప్రక్రియలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి, బాధిత కుటుంబానికి సహాయం త్వరగా అందేలా కృషి చేశారు. అనంతరం మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కనకం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు గద్దపాక గ్రామ ఉపసర్పంచ్ జంగా జైపాల్, అలాగే ముత్తారం గ్రామానికి చెందిన బూత్ అధ్యక్షులు కనకం రాజయ్య గారు తదితరులు పాల్గొని ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు.విపత్కర పరిస్థితిలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఎల్ఓసి అందజేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గారికి, ప్రత్యేక చొరవ చూపిన నాయకులకు తాళ్లపల్లి కుమార్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలి!

విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: డాక్టర్ ఎన్. దిలీప్ రావు





జమ్మికుంట, (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): విద్యార్థులు చిన్న వయసు నుంచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని నేషనల్ స్పోర్ట్స్ పర్సన్ డాక్టర్ ఎన్. దిలీప్ రావు సూచించారు. యునైటెడ్ నేషనల్ ఓటర్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు 'ట్రూత్ అబౌట్ డ్రగ్స్' పేరుతో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్ రావు మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థ, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే మాదకద్రవ్యాల బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు చదువు, క్రీడలపై దృష్టి సారిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జమ్మికుంట పట్టణ ఎస్సై ఎన్. రవి, మండల విద్యాధికారి ఎం. హేమలత మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రెడ్డి, తెలంగాణ అధికార ప్రతినిధి కొంగంటి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మీసాల విజయ్, హుజురాబాద్ నియోజక వర్గ అధ్యక్షుడు చెరుకు పైడయ్య, జమ్మికుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి రవీందర్, పార్లపల్లి వెంకటేశ్వర్లు, సామల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలి

- ప్రతి గుండెలో సంతోషం వెల్లివిరియాలి!

- జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేత వాసిరెడ్డి భాస్కరరావు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని తెలుగుదేశం పార్టీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఖమ్మం జిల్లా ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపాల వెలుగులు చీకట్లను తొలగించినట్లే, ప్రతి ఒక్కరి జీవితాల్లోని కష్టాలు, కన్నీళ్లు తొలగిపోయి సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, సమాజంలో సోదరభావం, ఐక్యత, మానవతా విలువలు మరింత బలపడాలని కోరుకున్నారు.నరకాసురుడి సంహారం అనంతరం చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ఆశావహ దృక్పథాన్ని, సానుకూల ఆలోచనలను పెంపొందించాలని అన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పండుగ ఆనందాన్ని పంచుకోవాలని, ఆపదలో ఉన్నవారికి చేయూతనిస్తూ, నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు నింపినప్పుడే పండుగకు నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు. దీపావళి వెలుగులు ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలు, అభివృద్ధి, సుఖసంతోషాలతో జీవించాలని వాసిరెడ్డి భాస్కరరావు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

వృద్ధులు, చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● వసతి గృహాల్లో కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకస్మిక తనిఖీలు ● వృద్ధులతో ఆత్మీయ పలకరింపు.. సమస్యలపై ఆరా ● శిశు గృహంలో మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు





కరీంనగర్,నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): వయోవృద్ధులు, దివ్యాంగులు, అనాథ చిన్నారులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శనివారం రాత్రి కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ వయోవృద్ధులు, దివ్యాంగుల ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. వృద్ధులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గీజర్‌తో పాటు ఇతర అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఆదివారం వసతి గృహంలోని వృద్ధులకు టపాసులు, స్వీట్లు అందిస్తామని పేర్కొన్నారు.**శిశు గృహంలో సౌకర్యాలపై ఆరా!**అనంతరం క్రిస్టియన్ కాలనీలోని శిశు గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి చిన్నారులను పరిశీలించి వారి బాగోగులు, అందుతున్న సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిశు గృహానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. భవనాన్ని అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చి పూర్తిస్థాయి చైల్డ్ కేర్ సెంటర్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి

● వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వరికి రూ.30 వేల పరిహారం చెల్లించాలి ● ముగ్గురు మంత్రులున్నా రైతులకు న్యాయం జరగడం లేదు: సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): మురసు తుపాను, ఈదురుగాలుల కారణంగా ఖమ్మం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 83 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.ఇందులో 50 వేల ఎకరాల్లో పత్తి, 25 వేల ఎకరాల్లో వరి, 8 వేల ఎకరాల్లో మిర్చి పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, ఏన్కూరు, తల్లాడ, వేంసూరు తదితర మండలాల్లో తుపాను ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. కోతకు వచ్చిన వరి పంటలు నేలకొరిగి నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రెండు మూడు రోజుల్లో పంట నష్టంపై సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. వాణిజ్య పంటలైన పత్తి, మిర్చికి ఎకరాకు రూ.50 వేలు, వరికి రూ.30 వేలు, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా రైతులకు పరిహారం ప్రకటించకపోవడం విచారకరమన్నారు. గతంలో ప్రకటించిన కరవు మండలాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, మిగిలిన నాలుగు మండలాలను సైతం కరవు జాబితాలో చేర్చాలని నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

దీపావళికి కంటి జాగ్రత్తలే శ్రీరామరక్ష

- 'వాసన్ ఐ కేర్' ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివరాం

- బాణసంచ ప్రమాద బాధిత చిన్నారులకు 'వాసన్ ఐ కేర్' ఉచిత వైద్యం, శస్త్రచికిత్సలు

- కంటికి గాయమైతే కంగారు పడకండి... తక్షణ సహాయానికి ఉచిత హెల్ప్‌లైన్ : 1800 5713 333





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : చిరునవ్వులు చిందించే చిన్నారుల కళ్లల్లో కాంతులు నింపాల్సిన దీపావళి పండుగ వేళ, చిన్నపాటి నిర్లక్ష్యం చీకట్లను నింపకూడదనే ఉద్దేశంతో 'వాసన్ ఐ కేర్' సంస్థ ఒక అద్భుతమైన మానవీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీపావళి బాణసంచా కాల్చే సమయంలో ప్రమాదవశాత్తు గాయపడే చిన్నారుల కంటి చూపును కాపాడేందుకు 'సురక్షిత కళ్లు సురక్షిత దీపావళి' పేరిట ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. ఖమ్మం వాసన్ ఐ కేర్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివరాం మాట్లాడుతూ... తమ సంస్థ సామాజిక బాధ్యత కింద 15 ఏళ్లలోపు పిల్లలకు అత్యవసర ప్రథమ చికిత్స, కంటి వైద్యం, ఉచిత ఫార్మసీ సేవలతో పాటు అవసరమైతే ఉచిత శస్త్రచికిత్సలను కూడా అందిస్తుందని ప్రకటించారు. ఈ సేవలు నవంబర్ 4 నుండి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఉన్న 200కు పైగా వాసన్ ఐ కేర్, ఏ.ఎన్.జి ఐ హాస్పిటల్ కేంద్రాల్లో లభ్యమవుతాయి.పండుగ సంతోషంలో పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ దగ్గరుండి పర్యవేక్షించాలని డాక్టర్ శివరాం విజ్ఞప్తి చేశారు. బాణసంచా కాల్చే సమయంలో పిల్లలకు రక్షణ కళ్లద్దాలు తొడగాలన్నారు. వెలగకుండా ఆగిపోయిన బాణసంచాను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయకూడదన్నారు. కంటిలో కి సపార్క్ లు, పొగ పడితే కంటిని గట్టిగా రుద్దడం కానీ, ఒత్తడం కానీ చేయకూడదన్నారు.కంటికి గాయమైనప్పుడు పానిక్ అవ్వకుండా ప్రశాంతంగా ఉండాలి.కంటిని బలంగా నీటితో కడగడం, నలపడం వంటివి చేయవద్దన్నారు. కంటిలో ఏవైనా తునకలు పడితే వాటిని చేతులతో తొలగించే ప్రయత్నం చేయకూడదు. కాటుక, ఆయింట్‌మెంట్లు, సొంత వైద్యం, ఇంటి చిట్కాలు అస్సలు వాడవద్దన్నారు.కంటిపై ఎలాంటి ఒత్తిడి పడకుండా తేలికపాటి గుడ్డ కప్పి, వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు.బాణసంచా ప్రమాదాల్లో చిన్నారులు గాయపడితే వెంటనే సమీపంలోని వాసన్ ఐ కేర్ సెంటర్‌ను ఆశ్రయించడానికి, సలహాలు పొందడానికి ఉచిత హెల్ప్‌లైన్ నంబర్: 1800 5713 333 ను సంప్రదించాలన్నారు. సకాలంలో అందించే సరైన వైద్య చికిత్స చిన్నారుల అమూల్యమైన కంటి చూపును కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని డాక్టర్ శివరాం కోరారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ కిషన్, డాక్టర్ సృజన్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టిన పాఠశాల ప్రదర్శన

- ఆకట్టుకున్న వినూత్న ప్రాజెక్టులు.. ప్రతిభను చాటిన చిన్నారులు





బోడుప్పల్, నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):బోడుప్పల్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శ్రీమతి ఉడుముల ఆరోగ్యమ్మ స్మారక పాఠశాల ప్రదర్శన2026ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్య, విజ్ఞానం, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై రూపొందించిన వినూత్న నమూనాలను ప్రదర్శించారు. వాటి పనితీరు, ఉపయోగాలను చిన్నారులు చక్కగా వివరించి సందర్శకులను ఆకట్టుకున్నారు.ప్రిన్సిపాల్, కార్యదర్శి ట్రస్టీ యు. జోసెఫ్ రెడ్డి మాట్లాడుతూ ప్రయోగాత్మక విద్యతో విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని అన్నారు. మేనేజింగ్ ట్రస్టీ ఎస్. తెరెసా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో ట్రెజరర్ ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు స్వప్న కాంతి, ప్రదర్శన ఇన్‌చార్జిలు జయ మాధవి, ఎస్తేర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మానవ సేవే మాధవ సేవ

● చిక్కడపల్లిలో వికాస్ కుమార్ జస్వాల్ ఆధ్వర్యంలో వితంతువులకు సహాయ పంపిణీ





హైదరాబాద్ నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):మానవ సేవే మాధవ సేవా భావనతో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ గణేష్ గౌటే పిలుపునిచ్చారు. చిక్కడపల్లిలో శ్రీ వికాస్ కుమార్ జస్వాల్ గారి ఆధ్వర్యంలో సుమారు 200 నుండి 300 మంది వితంతు మహిళలకు ఉచితంగా వంట సామాగ్రి (నిత్యావసరాలు) మరియు దీపావళి స్వీట్లను ఘనంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గణేష్ గౌటే మాట్లాడుతూ సమాజంలో కష్టాల్లో ఉన్న నిరుపేదలకు, వితంతువులకు చేయూతనందించడమే నిజమైన దైవసేవ అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో సేవలో ముందుకు రావాలని కోరారు. పండుగ వేళ వితంతు మహిళల ముఖాల్లో చిరునవ్వులు నింపిన వికాస్ కుమార్ జస్వాల్ సేవా నిరతిని కొనియాడారు.**పలు పార్టీల నాయకుల హాజరు:**ఈ సేవా కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బిజెపి రాష్ట్ర నాయకుడు నర్సింగ్ గౌడ్, ప్రముఖ నాయకులు జైపాల్ రెడ్డి, పార్థసారథి, రాములు, జయశ్రీ, ధనలక్ష్మితో పాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు విశేషంగా పాల్గొన్నారు.పండుగ సందర్భంగా నిరుపేద మహిళలకు ఆసరాగా నిలిచి సహాయం అందించిన మంచి మనసున్న మహారాజు శ్రీ వికాస్ కుమార్ జస్వాల్‌కి పలువురు నాయకులు, స్థానికులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఇంకుడు గుంతల నుండి ఇందిరమ్మ ఇండ్ల వరకు

కొత్తూరు(సి)లో అభివృద్ధి పనులకు శ్రీకారం



- పలు పనులు శంకుస్థాపన చేసిన కురవి ఎంపీడీఓ వీరబాబు





కురవి, నవంబర్ 7(పిసిడబ్లూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(సి) గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. గ్రామానికి మంజూరైన పలు అభివృద్ధి పనులకు కురవి ఎంపీడీఓ వీరబాబు శుక్రవారం శ్రీకారం చుట్టారు. అలాగే ఇందిరమ్మ గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇంటిని సందర్శించి వారితో మాట్లాడారు. గ్రామంలో మంజూరైన 10 ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఎంపీడీఓ వీరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మురుగు నీటి సమస్యను నివారించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామంలో మంజూరైన సరస్వతి, స్నేహాంజలి వీఓ భవనాలకు మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న లబ్ధిదారు జన్ను విజయ ఇంటిని ఎంపీడీఓ వీరబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు" ఘనంగా నిర్వహించాలి అని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. సొంత ఇంటిని నిర్మించుకున్న ఆనందంతో లబ్ధిదారులు తమ ఇళ్లలో దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ నిరంజన్ రెడ్డి, ఈసీ కైలా, టీవీ మంగ్యా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ చిప్పరపల్లి మల్సూరు, సిబ్బంది నాగరాజు, జగన్, సర్పంచ్ భర్త బాదావతు సిరి నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు జన్ను విజయ పాల్గొన్నారు.

అమృతకు బండి ఆపన్న హస్తం


● తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిన కేంద్ర మంత్రి ● తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయండి ● సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌ను కోరిన బండి సంజయ్ ● ఇల్లు మంజూరయ్యాక కుటుంబానికి అవసరమైన సరుకులన్నీ ఇవ్వండి

కరీంనగర్ నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్): సొంత ఇల్లు లేక స్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా



నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను అందించాలని కోరారు.

డాక్టర్ బంగారి స్వామికి టీయూడబ్ల్యూజే సమావేశ ఆహ్వానం



కరీంనగర్, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రేణీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ బంగారి స్వామిని ఉర్దూ రహనుమా-ఎ-దక్కన్ పత్రిక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) జనరల్ బాడీ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అస్గర్ హుస్సేన్, సీనియర్ రిపోర్టర్లు మహమ్మద్ తఖీ యుద్దీన్, షాకీర్, రఫీయుద్దీన్, రషీద్, మహమ్మద్ హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

కండక్టర్ కుటుంబానికి టీడీపీ మహిళా నేతల భరోసా

- ఆపదలో ఒంటరి కాదంటూ బాధిత కుటుంబానికి ధైర్యం

- ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : విధి నిర్వహణలో ఎదురైన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక కుటుంబాన్ని శనివారం ఖమ్మం తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆప్తురాలిని కోల్పోయిన ఆ కుటుంబం బాధను పంచుకుంటూ, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న గుండ్ల ప్రవళిక (24) విధి నిర్వహణలో ఉండగా ఓ మహిళా ప్రయాణికురాలితో టికెట్‌కు సంబంధించిన చిల్లర విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ప్రవళికను బస్సు నుంచి కిందకు నెట్టడంతో ఆమె ప్రమాదవశాత్తు బస్సు వెనుక చక్రాల కింద పడింది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో పది రోజులపాటు



మృత్యువుతో పోరాడిన ఆమె చివరకు కన్నుమూయడం అందరినీ కలచివేసింది. యుక్త వయసులోనే ప్రవళిక మృతి చెందడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ నేపథ్యంలో ఖమ్మం టీడీపీ మహిళా నాయకురాళ్లు మణుగూరులోని ప్రవళిక స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను, చికిత్సకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. కష్టకాలంలో అధైర్యపడవద్దని, న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగికి ఇలాంటి విషాదం చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం తక్షణమే తగిన న్యాయం చేయాలని, ఆర్థికంగా ఆదుకునేందుకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే తెలుగుదేశం పార్టీ తరఫున అండగా నిలుస్తామని, ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ పరామర్శలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు చలసాని ధూన్సీ, జిల్లా నాయకురాళ్లు రాటకొండ పావని, తాడిశెట్టి స్వాతి, కామ అనిత పాల్గొన్నారు.

10,959 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష ఫీజు

● కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో రూ.13.65 లక్షల చెల్లింపు



కరీంనగర్, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 10,959 మంది విద్యార్థుల పరీక్ష ఫీజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చెల్లించారు. ఈ మేరకు శనివారం ఐదు జిల్లాల కలెక్టర్లకు బీజేపీ నాయకులు చెక్కులు అందజేశారు.కరీంనగర్ జిల్లాలో 4,356 మంది, రాజన్న సిరిసిల్లలో 3,920 మంది, సిద్దిపేటలో 1,133 మంది, జగిత్యాలలో 1,087 మంది, హనుమకొండలో 463 మంది విద్యార్థులకు ఈ సహాయం అందనుంది. పేద విద్యార్థులు ఫీజు భారంతో ఇబ్బందులు పడకుండా మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.కార్యక్రమంలో నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బాస సత్యనారాయణరావు, బోయినపల్లి ప్రవీణ్‌రావు, కోమల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి టీజేఎఫ్ జర్నలిస్టుల అండ

ఎన్‌టీవీ కెమెరామెన్ వడ్డే పృథ్వి సతీమణి చైతన్యను పరామర్శ.. రూ.10 వేల ఆర్థిక సాయం

ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్): ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలుస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేటీజేఎఫ్) మరోసారి తమ మానవత్వాన్ని చాటుకుంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌టీవీ సీనియర్ కెమెరామెన్ వడ్డే పృథ్వి సతీమణి వడ్డే చైతన్యను జర్నలిస్టు సంఘం నాయకులు శనివారం పరామర్శించి, వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.ఇటీవల ఖమ్మం బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చైతన్య తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు తదితరులతో కూడిన జర్నలిస్టుల బృందం ఖమ్మంలోని కరుణగిరి సమీపంలోని సప్తగిరి ప్రాంతంలో ఉన్న వడ్డే పృథ్వి నివాసానికి వెళ్లింది. ఈ సందర్భంగా చైతన్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పింది. ప్రమాదం జరిగిన తీరును పృథ్వి



అడిగి తెలుసుకున్న నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం నాయకులు మాట్లాడుతూ..

జర్నలిస్టుల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చైతన్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం ఎంతో అవసరమని, కష్టకాలంలో తోటి జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, వనం నాగయ్య, కలువకోలను హరీష్ రాజ్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, కె.వి. సతీష్, నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, సుధాకర్, హైమాద్, మోహన్, శివకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

10న నారాయణగూడలో సదర్ సంబరాలు

● వి. హనుమంతరావుకు ఆహ్వాన పత్రిక అందజేత



నారాయణగూడ, నవంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్): ఈ నెల 10వ తేదీన నారాయణగూడ దీపక్ టాకీస్ సమీపంలో నిర్వహించనున్న సదర్ సయ్యాట (సదర్ సంబరాలు) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నాయకులు శ్రీ వి. హనుమంతరావు గారిని నిర్వాహకులు కోరారు. కాంగ్రెస్ బర్కత్‌పురా డివిజన్ ప్రెసిడెంట్ కైరంకొండ శ్రీనివాస్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు అస్లేష్, కిషోర్ యాదవ్ లతో కూడిన ప్రతినిధి బృందం వి. హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్‌లను కలిసి సదర్ కార్యక్రమ ఆహ్వాన పత్రికను గౌరవపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ సయ్యాట వేడుకలను ఈ నెల 10న నారాయణగూడలోని దీపక్ టాకీస్ ప్రాంగణంలో ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలకు ప్రజలు, యాదవ సోదరులు మరియు అభిమానులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కురవి మాజీ ఉపసర్పంచ్ నానమ్మ మృతి.. నివాళులర్పించిన నాయకులు



కురవి, నవంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):
కురవి మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్ కుమార్ నానమ్మ సంగెం సత్తెమ్మ (93) గారు అనారోగ్యంతో మృతి చెందారు.ఆమె మృతదేహానికి పూలమాల వేసి టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొణతం విజయ్, వార్డ్ సభ్యుడు దైద భద్రయ్య, నల్లపు రవి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సత్తెమ్మ గారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్తెమ్మ గారు గ్రామంలో మంచి మహిళగా పేరు తెచ్చుకున్నారని, ఆమె మృతి గ్రామానికి తీరని లోటని వారు పేర్కొన్నారు..

కాలుష్య రహిత దీపావళితో ఆరోగ్యకర సమాజానికి బాటలు

- బాణసంచా, శబ్ద కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు.. చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

హైదరాబాద్, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): దీపావళి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యం, చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. బాణసంచా వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరిగి శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. చిన్నారులను పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చనివ్వాలని, నీటి బకెట్, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.కాలిన గాయాలపై నూనె, టూత్‌పేస్ట్, పసుపు వంటి పదార్థాలు రాయకుండా చల్లని ప్రవహించే నీటితో 20 నిమిషాలు కడిగి, తీవ్ర గాయాలైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు.

అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, పెంపుడు జంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు స్వీట్లు, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా వాడే మందులను ఆపకూడదని సూచించారు.మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగిస్తూ, బాణసంచాకు దూరంగా ఉండి పర్యావరణహిత దీపావళి జరుపుకోవాలని డాక్టర్ మనోజ్‌రెడ్డి కోరారు.



“రగ్బీ“ రాష్ట్రస్థాయి పోటీల్లో కేజీబీవి విద్యార్థినుల ప్రభంజనం

- విజయాల బాటలో న్యూలక్ష్మీపురం కేజీబీవీ బాలికలు

- అభినందించిన స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర






ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) : పేదింటి ఆడపిల్లల కలలకు రెక్కలు తొడిగితే.. వారు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తారని న్యూలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు మరోసారి నిరూపించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ తమదైన ముద్ర వేస్తూ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లా కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. మైదానంలో ప్రత్యర్థులకు దీటుగా నిలుస్తూ, పట్టుదల, క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తితో ఆడిన ఈ బాలికలు అందరి ప్రశంసలు అందుకున్నారు. వారి విజయం కేవలం పతకాలకే పరిమితం కాకుండా.. గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగివున్న అపారమైన క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.సంగారెడ్డిలోని వోక్సన్ యూనివర్సిటీలో నవంబర్ 3, 4, 5 తేదీల్లో నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టు తరఫున ముదిగొండ మండలం, న్యూలక్ష్మీపురం కేజీబీవీకి చెందిన ఐదుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిదంగా అండర్-15 విభాగంలో జి. క్రితిక (10వ తరగతి), బి. కీర్తి (ఫస్ట్ ఇయర్ బైపీసీ) అద్భుత ఆటతీరుతో జట్టును విజయపథంలో నడిపించారు. ఆరు జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో ఖమ్మం జట్టు ప్రత్యర్థులకు ఒక్క ట్రై కూడా సాధించే అవకాశం ఇవ్వకుండా ఆధిపత్యం ప్రదర్శించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అదేవిధంగా అండర్-18 విభాగంలోనూ కేజీబీవీ విద్యార్థినులు ఎస్. నందిని (సీనియర్ ఎంపీసీ), బి. శ్వేత (సీనియర్ బైపీసీ), ఆర్. లాస్య (10వ తరగతి) తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రత్యర్థి జట్లకు గట్టిపోటీనిస్తూ సమన్వయం, వేగం, వ్యూహంతో ఆడిన ఈ విద్యార్థినులు ఖమ్మం జిల్లా జట్టుకు రాష్ట్రస్థాయి తృతీయ స్థానాన్ని అందించారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు రెండు విభాగాల్లోనూ విజయాలు సాధించడం పాఠశాలకే కాకుండా జిల్లా విద్యారంగానికి, క్రీడారంగానికి గర్వకారణంగా నిలిచింది. రగ్బీ మైదానంలో బాలికలు ప్రదర్శించిన ఈ అసాధారణ పోరాటపటిమ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని కేజీబీవీ న్యూలక్ష్మీపురం స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర అన్నారు. రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నమెంట్‌లో పథకాలు సాధించి విద్యార్థినులు శుక్రవారం న్యూలక్ష్మీపురం కేజీబీవీ పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిరా, పిఈటి సునీత ఆధ్వర్యంలో పాఠశాల అధ్యాపకురాళ్ళు, సిబ్బంది బాలికలను శాలువలతో సత్కరించి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ విజయాల వెనుక విద్యార్థినుల నిరంతర సాధనతోపాటు ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ రఘు మార్గదర్శకత్వం, పాఠశాల పీఈటీ పి. సునీత అంకితభావం, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర సహకారం కీలకంగా నిలిచాయి. ఇందులో భాగంగా నవంబర్ 1, 2 తేదీల్లో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ రఘు ముందుగానే ప్రత్యేక శిక్షణ, ఉచిత భోజనం, యూనిఫామ్ అందించి తదితర వసతులతో శిబిరాన్ని నిర్వహించి విద్యార్థినులకు విజయానికి ఉపయోగపడే మెళకువలు నేర్పించారు. ఆటలో వేగం, బంతిపై పట్టు, ప్రత్యర్థుల కదలికలను అంచనా వేయడం, జట్టుగా సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాల్లో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. ఆ శిక్షణ ఫలితమే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు సాధించిన విజయాలుగా క్రీడాభిమానులు అభివర్ణిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థినుల భద్రతను దగ్గరుండి పర్యవేక్షిస్తూ, వారి ఆటతీరును మెరుగుపరిచేందుకు నిరంతరం ప్రోత్సహించిన పీఈటీ పి. సునీత పాత్ర అభినందనీయం. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న బాలికలను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఆమె చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఈ విద్యార్థినులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాల, కళాశాల, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాల ని ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠ శాల, కళాశాల అధ్యాపకులు సుమలత, సఫియా బేగం, సుజాత, రజిని, కవిత, యాస్మిన్., నిర్మల నాగమణి, సుకన్య, జ్యోతి, రాధ, ఉమాదేవి, మాధవి, సుహాసిని, రేణుక తదితరులు ఉన్నారు.

కట్టా రాంపూర్‌లో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు

లబ్ధిదారు కుటుంబంతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్







కరీంనగర్ నవంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ పట్టణంలోని కట్టా రాంపూర్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు గుండా సంధ్యారాణి కుటుంబం నూతన గృహంలో నిర్వహించిన తొలి దీపావళి వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న సంధ్యారాణికి ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఆమె కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ లబ్ధిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి సత్కరించారు. అనంతరం వారితో కలిసి టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 2.30 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్లను కేటాయించినట్లు వివరించారు. గత పదేళ్లుగా ఇళ్ల మంజూరు లేకపోవడంతో భారీగా డిమాండ్ పెరిగిందని, అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.సొంతింటి కల నెరవేరి కొత్త ఇంట్లో తొలి దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారు కుటుంబంలో కనిపిస్తున్న ఆనందం ఎంతో సంతృప్తిని స్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సయ్య, ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇంటి వద్దకే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సేవలు

- రూ.70కే పోస్టుమెన్ ద్వారా జీవిత ధృవీకరణ పత్రం
- డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా ఐపిపిబి ప్రత్యేక సేవలు: ఖమ్మం ఎస్పీ వి వీరభద్ర స్వామి

కల్లూరు, నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :వృద్ధ పెన్షనర్లకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఇంటి వద్దకే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వి. వీరభద్ర స్వామి తెలిపారు.పెన్షనర్లు తమ జీవిత ధృవీకరణ పత్రాలను సమర్పించేందుకు బ్యాంకులు, పెన్షన్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోస్టుమెన్లు, గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ఇంటి వద్దనే ఈ సేవలను పొందవచ్చన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నివసించే వృద్ధులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ముఖ ధృవీకరణ, వేలిముద్ర బయోమెట్రిక్ సాంకేతికత ఆధారంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌ను రూపొందిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లతో పాటు ఈపీఎఫ్ఓ పెన్షనర్లు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చన్నారుఇంటి వద్ద సేవ పొందేందుకు జిఎస్టి తో కలిపి రూ. 70 నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పెన్షనర్లు ఆధార్ నంబర్, పెన్షన్ వివరాలను అందించాల్సి ఉంటుందని, సర్టిఫికేట్ విజయవంతంగా రూపొందిన అనంతరం రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వస్తుందని వివరించారు. మరుసటి రోజు నుంచి జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్‌లో సర్టిఫికేట్ వివరాలను పరిశీలించుకోవచ్చన్నారు.పెన్షనర్ల సమయం, ప్రయాణ శ్రమను ఆదా చేసే ఈ డిజిటల్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వి. వీరభద్ర స్వామి కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కమలాపూర్ పద్మశాలి యువజన సంఘం



- పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి



కమలాపూర్ నవంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో శనివారం కమలాపూర్ పట్టణ పద్మశాలి యువజన కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పద్మశాలి సంఘం సభ్యులు హైదరాబాద్ లో రాష్ట్ర పద్మశాలి సమాజం కోసం పద్మశాలి ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా, తెలంగాణ ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిన సందర్భంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు కు కమలాపూర్ పద్మశాలి సంఘం సభ్యులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని పద్మశాలీ ల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.అందులో భాగంగానే పద్మశాలి భవన నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితెల ప్రణవ్ బాబుకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హనుమకొండ ఎర్రగట్టు గుట్ట వద్ద నవంబర్ 29 వ తేదీ న నిర్వహించే కార్తీక మాస వన భోజనాల కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్, మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్,రాష్ట్ర నాయకులు పులికంటి రాజేందర్ జిల్లా నాయకులు కేదాసి వెంకటేశ్వర్లు,కమలాపూర్ చేనేత సంఘం అధ్యక్షులు బైరి జనార్ధన్ క్యాతం రవీందర్,మెండు రాంబాబు,చేరాల సారంగం, చేరాల వెంకట్రాజం, పట్టణ యూత్ అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి మార్గం చైతన్య,చేనేత సంఘం మేనేజర్ సామల దామోదర్, పద్మశాలి నాయకులు చేనేత సంఘం కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో సత్తా చాటిన శనిగరంకు చెందిన విద్యార్థిని“ బంగారు పతకం కైవసం

- జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని సంగం తాన్సిస్





కమలాపూర్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం లోని శనిగరం గ్రామానికి చెందిన విద్యార్థిని సంగం తాన్సిస్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం సొంతం చేసుకుంది. కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన సంగం తాన్సిస్ 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి మండలానికి,శనిగరం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని తెల్లాపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో తాన్సిస్ తన ప్రతిభను చాటుతూ గొప్పగా పోరాడి ప్రత్యర్థులను మట్టి కరిపించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది.ఈ విజయంతో త్వరలో డిసెంబర్‌లో గోవాలో నిర్వహించనున్న జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల శనిగరం గ్రామ ప్రజలు విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి విజయం సాధించి మరిన్ని పతకాలు సాధించాలని పలువురు ఆకాంక్షిస్తూ తాన్సిస్‌ను అభినందించారు.

డబుల్ బెడ్ రూమ్ కాలనీలో విద్యుత్,పెండింగ్ పనుల పరిశీలన..

● పరిశీలించిన ఎంపీడీవో గుండె బాబు,మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి.





కమలాపూర్ నవంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలోని 302 డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను శనివారం ఎంపీడీవో గుండె బాబు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి పరిశీలించారు. కాలనీలో పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.కరెంటు లైన్,హౌస్ వైరింగ్ పనులను పరిశీలించారు.విద్యుత్ పనులు చేసే కాంట్రాక్టర్ కు తగు సూచనలు చేశారు.తొందరగా బ్యాలెన్స్ పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలనలో ప్రణవ్ బాబు కృషితో పేదల సొంతింటి కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన హుజురాబాద్ కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్ నవంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్). హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు జమ్మికుంట హుజురాబాద్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణబాబు సారథ్యంలో శనివారం హుజరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పనులు,నిధులు మంజూరు చేయుటకు వారి సహాయ సహకారం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పై ఇరువురు చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి నా శాయశక్తుల కృషి చేస్తానని ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు కొండ రమేష్ గౌడ్,జమ్మికుంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరాజుపల్లిలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు

- పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు,మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని



హుజురాబాద్/కమలాపూర్ నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా హుజు రాబాద్ నియోజకవర్గం లోని ధర్మరాజు పల్లి గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు,మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పాల్గొన్నారు.ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పైలెట్ ప్రాజెక్టుగా హుజురాబాద్ మండలంలో ఎంపిక కాబడిన ధర్మరాజు పల్లి గ్రామంలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను శాలువాతో సత్కరించి,స్వీట్లు పంపిణీ చేసి పటాకులు పేల్చి ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రణవ్ బాబు మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేరి సందుకు చాలా సంతోషంగా ఉందని,పేదల కుటుంబాల లో వెలుగులు నింపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,టౌన్ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ని అరాచకాలు చేసినా నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ఎన్నికలు జరపడం ఎందుకు.. ఎంపిక చేసుకుంటే పోలా?

కూటమి అరాచకాలను ఎండగట్టిన కడప ఎంపీ

పులివెందుల నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ తీవ్ర అరాచకాలకు పాల్పడిందని,ఇంత ఘోరంగా ఎన్నికలు నిర్వహించే బదులు భవిష్యత్తులో ఎన్నికలు జరపకుండా వారే నేరుగా ఎంపిక చేసుకుంటే సరిపోతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్ని రిగ్గింగ్‌లు,దౌర్జన్యాలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే నిలిచారని,ఈ ఎన్నికల్లో నైతిక విజయం తమ పార్టీదేనని ఆయన స్పష్టం చేశారు.పులివెందుల నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీ,మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో సమగ్ర వివరాలు వెల్లడించారు.నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల్లోని మొత్తం 166 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు నిర్వహిస్తే,అందులో ఏకంగా 90 బూత్‌లలో టీడీపీ నాయకులు బహిరంగంగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని అవినాష్ రెడ్డి ఆరోపించారు.పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 15 బూతుల్లో 9 బూతులను (8 పూర్తిగా, 1 పాక్షికంగా) రిగ్గింగ్ చేసినప్పటికీ,టీడీపీ మెజారిటీ కేవలం 1,463 ఓట్లకు మాత్రమే పరిమితమైందన్నారు. లింగాల మండలం 33 పోలింగ్ బూతులకు గాను 14 బూతుల్లో యథేచ్ఛగా రిగ్గింగ్,స్టాంపింగ్ చేసుకుని దాదాపు 8,000 నుంచి 9,000 ఓట్లు అక్రమంగా వేసుకున్నప్పటికీ, టీడీపీ కేవలం 1,500 ఓట్ల స్వల్ప తేడాతో మాత్రమే గట్టెక్కిందని అలాగే వేముల మండలం మండల కేంద్రంలోని 6 బూతులను టీడీపీ నేతలు రిగ్గింగ్ చేసినా, ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ 1,569 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించిందన్నారు.వేంపల్లి మండలం లో ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా (ఫ్రీ అండ్ ఫెయిర్) ఎన్నికలు జరిగాయని,అక్కడ ప్రజా తీర్పు స్పష్టంగా కనిపించిందని తెలిపారు. కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) మొత్తం ఏకమైనా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఏకంగా 19,192 ఓట్ల భారీ మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించారు. **కూటమిపై 3,873 ఓట్ల స్పష్టమైన మెజారిటీ** పులివెందుల మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాల (వేముల,వేంపల్లి,లింగాల, పులివెందుల) ఫలితాలను పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే స్పష్టమైన ఆధిక్యమని ఎంపీ వివరించారు. వైఎస్సార్‌సీపీ సాధించిన ఓట్లు 55,495 కాగా టీడీపీ + జనసేన + బీజేపీ కూటమి ఓట్లు 51,622 మాత్రమే అనివైఎస్సార్‌సీపీ ఆధిక్యత (మెజారిటీ) 3,873 ఓట్లు సాధించదని పేర్కొన్నారు.నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నా,ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించినా,తప్పుడు కేసులు బనాయించినా నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లు వైఎస్సార్‌సీపీకే అత్యధిక ఓట్లు కట్టబెట్టారని,ఈ ఘన విజయాన్ని పార్టీ కార్యకర్తల పోరాట పటిమకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.నైతిక విజేతలకు అండగా ఉంటాం అని టీడీపీ రిగ్గింగ్ వల్ల స్వల్ప తేడాతో ఓటమి చెందిన లింగాల జడ్పీటీసీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి, సింహాద్రిపురం జడ్పీటీసీ అభ్యర్థి మోపూరు సావిత్రి నైతికంగా విజయం సాధించారని,పార్టీ వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వేంపల్లె జడ్పీటీసీగా రికార్డు మెజారిటీ సాధించిన భర్తల వెంకట శివమ్మ, వేముల జడ్పీటీసీగా గెలుపొందిన నాగెళ్ల సత్యప్రభావతమ్మలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.



జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు

కర్నూలు నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): జిల్లా వ్యాప్తంగా 6 కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతోందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం కర్నూలు నగరంలోని బి.క్యాంపులో ఉన్న సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కర్నూలు ఎస్పీ పరిశీలించారు. పోలీసు అధికారులకు భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.కౌంటింగ్ ప్రక్రియ వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా కర్నూలులో 2,ఎమ్మిగనూరులో 1, ఆదోనిలో 1,పత్తికొండలో 1,ఆలూరులో 1 మొత్తం 6 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలిపారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద



పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు దాదాపు పూర్తయిందని, సాధారణ ఓట్ల లెక్కింపు అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల అధికారుల అనుమతి పొందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే లోపలికి ప్రవేశం ఉంటుందన్నారు. భద్రతా పరంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు విజ్ఞప్తి చేశారు. కర్నూలు ఎస్పీతో పాటు కర్నూలు డిఎస్పీ శ్రీ రాఘవేంద్ర, సిఐలు మధుసుధన్ రావు, చంద్రబాబు నాయుడు,శేషయ్య, తబ్రేజ్ , ఎస్సైలు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో మమేకమై పనిచేస్తుంది

బిఆర్ఎస్ కావాలని తప్పుడు ప్రచారం చేస్తుంది

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



కూకట్‌పల్లి నవంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూములను అమ్ముకుంటుందన్న కూకట్పల్లి శాసనసభ్యుడు విమర్శలను టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తిప్పి కొట్టారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం పైనా,ప్రభుత్వ భూముల అమ్మకాల పైన బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. దమ్ముంటే కృష్ణారావు తను చేసిన ఆరోపణలపై నిలబడాలంటూ ఆయన చాలెంజ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం భూములను అమ్ముకుంటోశేదంటూ కూకట్పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలపై రమేష్ తీవ్రంగా స్పందించారు . రమేష్ మాట్లాడుతూ కృష్ణారావు విమర్శలను తిప్పి కొట్టారు.ముఖ్యమంత్రి పై విమర్శలు చేసేటప్పుడు నోరు సంభాళిశీచుకుని మాట్లాడాలని హెచ్చరించారు .కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తోందన్నారు.ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కృష్ణారావు ఇతర టిఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు.బంగారు తెలంగాణ అంటూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలు అప్పులు రాష్ట్రం నెత్తిన పెట్టి పోయిందన్నారు. చెరువులు కుంటలు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అక్రమ నిర్మాణాలకు కృష్ణారావు, అతని అనుచరులే ఆద్యులని రమేష్ ధ్వజమెత్తారు.కేవలం హౌసింగ్ బోర్డ్ అభివృద్ధికి తాను 2 వేలకోట్ల రూపాయలు వెచ్చించానని కృష్ణారావు చెప్పడాన్ని రమేష్ ప్రశ్నించారు.దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమన్నారు కెపిహెచ్బి కాలనీలో ఒక స్కూలు ఒక ఆసుపత్రి కూడా కట్టలేక గత ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు స్కూల్ కోసం తెచ్చిన స్టీల్ సైతం టిఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారని బండి రమేష్ ధ్వజమెత్తారు ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన కృష్ణారావు కూకట్పల్లికి ల్యాండ్ మార్క్ గా తను ఏం చేశాడో చూపించాలన్నారు.తన 12 ఏళ్ల హయాంలో పేద ప్రజల కోసం కృష్ణారావు ఎన్ని ఇళ్లు కట్టించాడో చూపించాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని రమేష్ పేర్కొన్నారు.ఐటీ, పారిశ్రామిక, ఇతర ఉత్పాదకరంగాల్లో రాష్ట్రం ముందంజ వేసింది అన్నారు ఎల్ నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో కరువు వస్తే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగట్టి టిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వారిని మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కరువు నివారణ కోసం తాగునీరు సాగునీరు ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో కలిసి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డ్ లో 11 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని 400 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని రెండో విడతలో మరో మూడు వేల ఇళ్ళ నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని రమేష్ తెలిపారు.తాను, అధికారులు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి డివిజన్లో ప్రతిరోజు పర్యటిస్తున్నామని పేద ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని రమేష్ పేర్కొన్నారు.